సాక్షి నల్లగొండ

శనివారం । 10 । ఆగస్టు । 2024



నిందితుల అరెస్టు
దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. - 8లో



యువతకు శిక్షణ ఇస్తాం
యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తామని బండ్రు శోభారాణి పేర్కొన్నారు. - 8లో



మానవత్వం చాటుకున్న ఎస్పీ
రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తన కాన్వాయ్‌లో ఆస్పత్రికి పంపారు. - 8లో

న్యూస్‌రీల్

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

నల్లగొండ : నల్లగొండలోని పలు రేషన్ దుకాణాలను సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రేషన్‌కార్డు దారుల నుంచి బియ్యంకొన్న వారి ఆథరైజేషన్ రద్దు చేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్డుదారులు విధిగా బియ్యం తీసుకెళ్లాలని.. ఒకవేళ అమ్మితే వారి కార్డు రద్దు చేస్తామని తెలిపారు. డీలర్లు సమయ పాలన పాటించి, కార్డుదారులకు ఉచిత బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు దీపక్, జావిద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అంజయ్య, చారి, పుల్లయ్య, పాష పాల్గొన్నారు.

రైస్ మిల్లులో..



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లిలోని సాయి వెంకటేశ్వర పార్‌బాయిల్డ్ మిల్లును జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 51 శాతం, 2023–24 యాసంగి సీజన్‌కు సంబంధించి 67శాతం సీఎంఆర్ పూర్తి చేసినట్లు తెలిపారు. మిల్లు యాజమానులు ఎస్‌సీఐకి అందించాలిన బియ్యం విషయంలో అలసత్వం వహించడం తగదన్నారు. ఆయన వెంట శ్రీనివాస్‌గౌడ్, పెద్దవూర డీటీ సీఎస్ ముక్తార్ అలీ, మిర్యాలగూడ ఆర్ఐసీ వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షు సముద్రాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న గండి పూడ్చివేత పనులు



గండి వద్ద సాగుతున్న పూడ్చివేత పనులు

హాలియా : అనుముల మండలంలోని మారేపల్లి గ్రామ సమీపంలో 36వ కిలోమీటర్ వద్ద లో లెవల్ కెనాల్(వరద కాలువ)కు పడిన గండి పూడ్చివేత పనులు శుక్రవారం కొనసాగాయి. గండి పడ్డ ప్రాంతంలో అడుగున మొదట నల్లమట్టి, ఎర్రమట్టితో నింపి జేసీబీతో చదును చేసి కట్టను పూడ్చి పటిష్టం చేశారు. వరద కాలువలో పేరుకు పోయిన చెత్త చెదారం తొలగింపు పనులు పూర్తి కావడానికి మరో రోజు సమయం పట్టవచ్చని వరద కాలువ ఏఈ మల్లయ్య చెబుతున్నారు.

యూటీఎస్ యాప్‌తో రైల్వే టికెట్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు

నల్లగొండ రూరల్, మిర్యాలగూడ అర్బన్ : యూటీఎస్ యాప్ ద్వారా ప్రయాణికులు సులువుగా రైలు సాధారణ టికెట్ పొందవచ్చని రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు తెలిపారు. శుక్రవారం నల్లగొండ, మిర్యాలగూడ రైల్వేస్టేషన్లలో యూటీఎస్ యాప్ అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడకుండా రైల్వే ప్రయాణికులు ఈ యాప్ ద్వారా టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఎస్.రాజు, టీటీఐలు సుకేష్, బాలకృష్ణ, ప్రవీణ్‌కుమార్, దాశరది, టీవీ రావు, హేమకుమార్ ఉన్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో 2024–25 ప్రథమ సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు ఆగస్టు 12 స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్.నర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ 2024 అర్హత సాధించినవారు, పదో తరగతి, నేషనల్ ఓపెన్ స్కూల్ ఉత్తీర్ణులైన వారు స్పాట్ కౌన్సిలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆగస్టు 11వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 12వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు.



• పాల నురగ వలె..

సాగర్ జలాశయానికి శుక్రవారం 3,21,951 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 2,86,548 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదవుతోంది. ప్రస్తుత నీటిమట్టం 587.60 అడుగులు (8626 టీఎంసీలు)గా ఉంది. 26 గేట్ల ద్వారా దిగువకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.

• నాగేంద్రుడికి పూజలు



నాగుల పంచమి సందర్భంగా శుక్రవారం నల్లగొండలో పుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న భక్తులు

నిధులు లేక నిస్తేజం!

- గ్రామ పంచాయతీలకు నిలిచిన కేంద్ర, రాష్ట్ర ఫండ్స్
- ఆరు నెలల నుంచి ప్రత్యేక అధికారుల పాలన
- అప్పులు చేసి పనులు చేయిస్తున్న కార్యదర్శులు
- బిల్లులు రాకపోవడంతో తప్పని ఆర్థిక ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నిధులు లేక గ్రామ పంచాయతీలు నిస్తేజంలో పడ్డాయి. గత ఫిబ్రవరి నుంచి పంచాయతీల్లో పాలక వర్గాల కాల పరిమితి పూర్తయి ప్రత్యేక అధికారుల పాలనలోకి వచ్చాయి. ఎన్నికలు నిర్వహించక ఆరు నెలలు గడవడంతో కేంద్ర నిధులు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వకపోవడంతో పంచాయతీల్లో చిన్నపాటి బల్బులు వేయాలన్నా, పారిశుద్ధ్య పనులకు చేపట్టాలన్నా కార్యదర్శులే సొంతంగా డబ్బులు పెట్టుకోవాల్సి వస్తోంది. ఆరు నెలలుగా ఒక్కో కార్యదర్శి పంచాయతీ సామర్థ్యాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు పెట్టారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో నల్లగొండ జిల్లాలోని 844 గ్రామాలు, సూర్యాపేట జిల్లాలో 475 గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆరు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆగిన ఆర్థిక సంఘం నిధులు

పంచాయతీల పాలక వర్గాల కాలపరిమితి ఫిబ్రవరి 2తో పూర్తయింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే అంటే దాదాపు సంవత్సరం నుంచి ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వడం లేదు. కేంద్ర నిధులు రావాలంటే గ్రామ పంచాయతీల పాలకవర్గాలుండాలి. ఆరు మాసాల నుంచి ప్రత్యేక అధికారుల పాలన కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పంచాయతీల్లో పనుల కోసం ఇతర నిధులను విడుదల చేయలేదు.

సొంత డబ్బులతో పంచాయతీ పారిశుద్ధ్యం

గ్రామాల్లో సర్పంచ్‌లు ఉన్నప్పుడు నిధులు రాకన్నా వారే సొంతంగా డబ్బులు పెట్టుకుని పారిశుద్ధ్య, వీధి దీపాలు ఇతర పనులు చేయించేవారు. కానీ ప్రత్యేక అధికారుల పాలన రావడంతో కార్యదర్శులే ఆయా పనులకు సొంతంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. బిల్లులు రాకపోవడంతో కార్యదర్శులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

సర్పంచ్‌ల బిల్లులు కూడా అంతే..

గత పాలకవర్గానికి సంబంధించిన సర్పంచ్‌లు అప్పటి ప్రభుత్వం చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, హరితహారం మొక్కలు తర్వాత క్రీడా ప్రాంగణాలు తదితర పనులు చేపట్టారు. వాటి బిల్లులు సక్రమంగా రావడం లేదని కాంట్రాక్టర్లు రాని చోట సర్పంచ్‌లే సొంతంగా పనులు చేయించారు. చాలా మంది సర్పంచ్‌లకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చించారు. ఆ బిల్లులు కూడా ఇప్పటివరకు రాలేదని చెబుతున్నారు.

ప్రత్యేక పాలనలో అన్నీ సమస్యలే..



ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు ఎక్కువయ్యాయి. తాగునీరు సరిగ్గా రావడం లేదు. ఎల్ఈడీ లైట్లు మరమ్మతు చేయించకుండా చిన్నచిన్న బల్బులు వేస్తున్నారు. ఇదేంటనే అధికారులను అడిగితే నిధుల కొరత అని చెబుతున్నారు.

– బొమ్మరబోయిన భార్గవ్, జి.యడవెల్లి, కనగల్ మండలం

పట్టించుకోవడం లేదు



ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్య పనులను చేపట్టడం లేదు. మా వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత ఆరు నెలలుగా నిధులు రాకపోవడంతో కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు.

– బత్తుల నరసింహగౌడ్, గుండ్రాంపల్లి, చిట్యాల మండలం

బిల్లులు రాక అవస్థలు పడుతున్నాం



సింగారెడ్డిపాలెం గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.16 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశా. ఈ డబ్బుతో డ్రెయినేజీలు, మోటార్ రిపేర్లు, వీధిలైట్ల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనానికి ఖర్చు చేశా. పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావొస్తున్నా పెండింగ్ బిల్లులు రావడం లేదు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి.

– షరీఫ్, మాజీ సర్పంచ్, సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్ మండలం

బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి



గ్రామ అభివృద్ధికి ఐదేళ్లలో రూ.50 లక్షల నిధులు ఖర్చు చేశా. ఈ నిధులను గ్రామ పంచాయతీ భవనం, ట్రాక్టర్ షెడ్ల నిర్మాణం, రహదారుల ఫార్మేషన్, కల్వర్టుల నిర్మాణం, శ్మశాన వాటిక, ట్రాక్టర్ డీజిల్, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వినియోగించాను. రూ.12 లక్షలు మాత్రమే బిల్లులు వచ్చాయి. మిగతా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

– ధరావత్ భద్రునాయక్, రాజుతండా సర్పంచ్, చివ్వెంల మండలం

'సుంకిశాల' ఘటనపై ఆరా..

- నీట మునిగిన సుంకిశాల పంప్‌హౌస్‌ను పరిశీలించిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల, శాసనమండలి చైర్మన్ గుత్తా

పెద్దవూర : జంటనగరాలకు తాగునీటిని అందించే సుంకిశాల ప్రాజెక్టు పంప్‌హౌజ్‌ను శుక్రవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పరిశీలించారు. నాగార్జునసాగర్ జలాశయంలో 455 అడుగుల లోతులో నీటిమట్టం ఉన్నా హైదరాబాద్ జంటనగరాలకు తాగునీరు అందించేందుకు చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు పంప్‌హౌస్‌లోకి నీరు చేరి సైడ్‌వాల్ పడిపోయి ఇన్‌టెక్ వెల్‌లోకి నీరు వచ్చి మునిగిన ప్రాంతాన్ని వారు సందర్శించారు. అక్కడ పనిచేసే ఇంజినీర్లు, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. ఘటనకు గల కారణాలను తెలుసుకున్నారు.ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఏఎస్పీ రాములునాయక్, జలమండలి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, డైరెక్టర్ సుదర్శన్, సాగర్ ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు, మెయిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదాడ మీదుగా సుంకిశాలకు..



మంత్రులు, గుత్తాకు స్వాగతం పలుకుతున్న కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : సుంకిశాల ప్రాజెక్టు పరిశీలనకు పోవడానికి ముందు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో కోదాడకు వచ్చారు. అప్పటికే ఖమ్మం నుంచి కోదాడకు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హెలికాప్టర్‌లో తీసుకొని సుంకిశాలకు వెళ్లారు. వీరిని కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి కలిశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేంధర్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ హెలికాప్టర్ దిగకుండానే వెళ్లిపోయారు.



ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, మండలి చైర్మన్ గుత్తా, కలెక్టర్

చిన్న నీటి వనరులు పూర్తి చేయాలి

చండూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మునుగోడు నియోజకవర్గంలో చిన్న నీటి వనరులైన వెల్మకన్నె ఫీడర్ ఛానల్, శేసిలేటివాగు ఫీడర్ ఛానల్ నిర్మాణం పనులను పూర్తి చేసి సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చండూరులో నిర్వహించిన ఆ పార్టీ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా కనీసం పేదలకు రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు ఇవ్వలేకపోయారని విమర్శించారు. 2018 కంటే ముందు రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంటరుణాలను పూర్తిగా మాఫీ చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, నలపరాజు సతీష్‌కుమార్, పల్లె యాదయ్య, వెంకటేశ్వర్లు, రాములు, వెంకటేష్, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- మున్సిపల్ సీడీఎం ఎ.గౌతమ్

నల్లగొండ టూటౌన్ : పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ సీడీఎం ఎ.గౌతమ్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీ పార్కులో ఆయన మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని కోరారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ అధికారులను కోరారు. అనంతరం పట్టణంలోని కుక్కల సంతాన రహిత ఆపరేషన్ల కేంద్రాన్ని, డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. దేవరకొండ రోడ్డు, హైదరాబాదు రోడ్డు ప్రాంతాల్లో శానిటేషన్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ గౌతమ్



మొక్కలు నాటుతున్న అధికారులు

'డిండి' డీపీఆర్ పూర్తిచేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి
- డిండి ఎత్తిపోతలపై నల్లగొండలో సదస్సు

నల్లగొండ టౌన్ : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండలోని క్లాక్‌టవర్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో రంగారెడ్డి మాట్లాడారు. 2015లో డిండి ఎత్తిపోతల పథకం ప్రారంభమైతే ఇప్పటివరకు కనీసం డీపీఆర్ ఆమోదించలేదని, పర్యావరణ అనుమతులు కూడా తీసుకోలేదని మండిపడ్డారు. సీపీఎం ఆధ్వర్యంలో రిజర్వాయర్‌ను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. 500 గ్రామాలకు తాగునీరు, 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే డిండి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వమని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఇంజినీర్ ఇంద్రసేనారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ డిండి ఎత్తిపోతల పథకం ఎందుకు పెండింగ్‌లో ఉందో జిల్లా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. సింగరాయపల్లి, గొట్టముక్కల, చింతపల్లి, శివన్నగూడెం తదితర ప్రాజెక్టులకు నిర్మాణానికి డబ్బులు కేటాయించలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులు వస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. సదస్సులో బొంతల చంద్రారెడ్డి, నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాశం, లక్ష్మీనారాయణ, దోనూరు నర్సిరెడ్డి, దొడ యాదిరెడ్డి, సలీం, కంబాలపల్లి ఆనంద్, నల్లా వెంకటయ్య, నాంపల్లి చంద్రమౌళి, కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, అవిశెట్టి శంకరయ్య, జిట్ట నగేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రంగారెడ్డి

సాగర్‌కు ప్రత్యేక బస్సులు

- మహిళలకూ చార్జీలు

నల్లగొండ రూరల్ : ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోలనుంచి నాగార్జునసాగర్‌కు ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి డిపో నుంచి ప్రత్యేక బస్సులు సాగర్‌కు వెళతాయన్నా రు. ఈ బస్‌ల్లో మహాలక్ష్మి పథకం వర్తించదని, ప్రయాణికులంతా టికెట్ ధర చెల్లించాలని పేర్కొన్నారు. ఏడు డిపోల నుంచి శని, ఆది వారాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

నల్లగొండ : సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ అర్హత పరీక్ష హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎ.నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న అర్హత పరీక్ష ఉంటుందని.. అభ్యర్థులు https://studycircle.cgg.gov.inఅనే వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

11న డిండిలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష



హెలిపాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

డిండి: దేవరకొండ నియోజకవర్గంలోని నీటిపారుదల ప్రాజెక్టులపై ఆదివారం డిండి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలలో నిర్వహించే రివ్యూ సమావేశానికి ఇరిగేషన్ శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఇరిగేషన్ శాఖా ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం గురుకుల పాఠశాలలో జరుగుతున్న హెలిపాడ్ పనులను ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యానారాయణరెడ్డి, డిండి రూరల్ సీఐ సురేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్లు, ఎస్ఎల్‌బీసీ పెండింగ్ పనుల పరిస్థితిపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ అంజనేయులు, ఇరిగేషన్ ఈఈ శ్రీధర్‌రావు, డీఈ మనోహర్, ఏఈ ఫయాజ్, ఆర్‌అండ్‌బీ డీఈ భాస్కర్, ఎస్.రాజు తదితరులున్నారు.

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ధరణికోట రాము శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా వారికి ఒక రోజు శిక్షతోపాటు జరిమానా విధించారు.

ట్రాక్టర్ దగ్ధం



పూర్తిగా దగ్ధమైన ట్రాక్టర్

ఆలేరు రూరల్ : వ్యవసాయ బావి వద్ద ఉంచిన ట్రాక్టర్‌పై గురువారం అర్ధరాత్రి పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఘటన ఆలేరు మండలం పటేల్ గూడెం గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్‌గూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పులగం పద్మ భర్త యాదిరెడ్డి తన వ్యవసాయ పొలాన్ని సాయంత్రం ఏడు గంటల వరకు దున్ని ట్రాక్టర్‌ను అక్కడే ఉంచి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వచ్చి చూడగా.. ట్రాక్టర్ మొత్తం కాలి బూడిదైంది. తన మీద పాత కక్షల కారణంగానే అదే గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి, కందడి ప్రకాష్‌రెడ్డి మరికొందరితో కలిసి ట్రాక్టర్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టారని యాదిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రాక్టర్ విలువ దాదాపు ఏడు లక్షల రూపాయలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



యం.నర్సయ్య

మునగాల: మండలంలోని రేపాల గ్రామానికి చెందిన మెరుగు నర్సయ్య(56) గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని కుమారుడు వెంకన్న తెలిపారు. తమ తండ్రికి కొంతకాలంగా మతిస్థిమితం లేదని, ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. శనివారం మునగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానన్నారు. తమ తండ్రి ఆచూకీ తెలిస్తే 8886999495 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని వెంకన్న కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యం

రామన్నపేట : మండలంలోని సిరిపురం శివారులో నిల్వచేసిన 54 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం తెలుసుకున్న అధికారులు.. తనిఖీలు నిర్వహించి 180 తెల్ల బస్తాల్లో రేషన్ బియ్యం గుర్తించారు. మహేందర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ గౌస్, సివిల్‌సప్లయ్ డీటీ బాలమణి సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- దొంగను పట్టుకొని కిలో 832గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు
- చౌటుప్పల్ సమీపంలో జులై 27న 2.1 కిలోల బంగారం అపహరించిన ముఠా
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో గత నెలలో జరిగిన భారీ దారిదోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. చాకచక్యంగా భారీ దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగల్లో ఒకడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు సొత్తును సైతం రికవరీ చేశారు. ఈ కేసు వివరాలను శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు హైదరాబాద్‌లోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ముంబాయిలోని పశ్చిమ గోరేగావ్‌లోని జవేరిబజార్‌లో ఉన్న ఏడీ జ్యువెలరీ దుకాణం యాజమాన్యానికి ముంబై, పూణెతోపాటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ జ్యువెలరీ దుకాణాలు ఉన్నాయి. వ్యాపారంలో భాగంగా ప్రధాన దుకాణం నుంచి ఇతర దుకాణాలకు బంగారు ఆభరణాలను తరచుగా తీసుకెళ్తుంటారు. గత నెల 26న 2.1కిలోల వివిధ రకాల ఆభరణాలను సంస్థకు చెందిన ఉద్యోగి పురోహిత్ భరత్‌కుమార్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని దుకాణానికి పంపించారు. అందుకోసం తరచుగా వినియోగించే ఆరెంజ్ ట్రావెల్స్‌లోనే టికెట్స్ బుకింగ్ చేసుకున్నారు. అనంతరం సదరు ఉద్యోగి అక్కడే చునాబట్టి బస్టాప్‌లో బస్సులో ఎక్కి ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరాడు.

టిఫిన్ కోసం బస్సు ఆపిన సమయంలో..

ముంబాయి నుంచి బయలుదేరిన ట్రావెల్ బస్సు మరుసటి రోజు (27న) ఉదయం 09.30గంటల సమయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ శివారు లక్కారం గ్రామ పరిధిలోని ఓ హోటల్ వద్ద టిఫిన్ చేసేందుకు డ్రైవర్ బస్సును ఆపాడు. ప్రయాణికులందరు తమ లగేజీని బస్సులోని విడిచి టిఫిన్ చేసేందుకు కిందకు దిగారు. 20నిమిషాల అనంతరం ప్రయాణికులు బస్సులోకి వెళ్లారు. అదే సమయంలో పురోహిత్ భరత్ కుమార్ తాను బంగారాన్ని తీసుకెళ్తున్న బ్యాగును చూసుకోగా బంగారు ఆభరణాల పెట్టె కన్పించలేదు. వెంటనే విషయాన్ని యజమానికి తెలియజేశాడు. అక్కడి నుంచి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గుర్తించిన పోలీసులు

బంగారు ఆభరణాల దుకాణ సేల్స్ మేనేజర్ కునాల్ కొటారీ అదే నెల 28న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ముంబాయి నుంచి ఇతర రాష్ట్రాలను బంగారాన్ని రవాణా చేసే సంస్థలు, వ్యక్తుల గురించి బాగా తెలిసిన ముఠాల సభ్యులే ఈ పనిచేసి ఉంటారని పోలీసులు గుర్తించారు. ప్రధానంగా ఆరెంజ్ ట్రావెల్ బస్సులనే ప్రత్యేకంగా టార్గెట్ చేసే ముఠాలపై దృష్టిసారించారు. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను ప్రత్యేక బృందాలను పంపించారు. పోలీస్ బృందాలు ఆయా రాష్ట్రాలలో విచారణ చేశారు. అందులో భాగంగా ఈ ముఠా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినదిగా గుర్తించి ఆ రాష్ట్రంలోని ధార్ జిల్లా ధర్మపురి మండలానికి వెళ్లారు. అయితే, అక్కడ నిందితుల ఆచూకీ మాత్రం లభించలేదు.

హోటల్ వద్ద పట్టుబడిన నిందితుడు

దోపిడీకి పాల్పడిన ముగ్గురు సభ్యులుగల ఈ ముఠా ఘటనా స్థలం నుంచి చాకచక్యంగా తప్పించుకున్నారు. కేవలం బంగారం రవాణా చేసే వ్యక్తులనే ఎంచుకునే ఈ ముఠాలు సరుకు రవాణా జరుగుతున్న బస్సులోనే ప్రయాణికులుగా ఎక్కుతారు. అలా ఎక్కిన తర్వాత అనువైన సమయాన్ని ఎంచుకొని దోపిడీకి పాల్పడుతారు. ఆ తర్వాత అప్పటికే అక్కడకు వచ్చే తప్పుడు నంబర్ ప్లేటు కలిగిన తమ వాహనంలో ఎక్కి పారిపోతుంటారు. అలానే చౌటుప్పల్ వద్ద బస్సులోని బ్యాగు నుంచి బంగారాన్ని తీసుకున్నాక అదే తరహాలో పారిపోయారు. శుక్రవారం చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులోని ఆధ్య గ్రాండ్ హోటల్ వద్ద ఉన్న నిందితుడు సోనీ ఠాకూర్(22)ను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద కిలో 832గ్రాముల వివిధ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు నిందితులైన అలీఖాన్, అస్లాంలు పరారీలో ఉన్నారు. కేసును ఛేదించిన అధికారులు, సిబ్బందిని సీపీ సుధీర్‌బాబు అభినందించారు. విలేకరుల సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు డీసీపీ లక్ష్మినారాయణ, చౌటుప్పల్, భువనగిరి ఏసీపీలు మధుసూదన్ రెడ్డి, రవికిరణ్‌రెడ్డి, చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బంద్రు శోభారాణి

ఆలేరురూరల్ : యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తామని తెలంగాణ రాష్ట్ర ఉమెన్స్ కో ఆపరేటీవ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బంద్రు శోభారాణి అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యువతలో ఉన్న నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా వారు మంచి అవకాశాలు అందిపుచ్చుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఉమెన్స్ కో ఆపరేటీవ్ కార్పొరేషన్ ద్వారా ఆలేరు నియోజకవర్గంలో శిక్షణ కార్యక్రమాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 12వ తేదీన స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మొదటి ప్రాధాన్యతగా మహిళలకు ఎలక్ట్రానిక్ ఆటోలు సమకూర్చి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆలేరు ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, ఆలేరు ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే విషయాన్ని సీఎం దృష్టి తీసుకెళ్లి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీ సలీం, పాము అనిత, ఆరె రాములు మల్‌రెడ్డి సోమిరెడ్డి, బుగ్గ నవీన్, సురేందర్‌రెడ్డి, దీప, లత, చింతకింది రేణుక తదితరులు పాల్గొన్నారు.

పులిచింతలకు కొనసాగుతున్న వరద ఉధృతి

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం నాగార్జున సాగర్ నుంచి 2,30,031 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. దీంతో పులిచింతలలోని 11 గేట్లను ఎత్తి నీటిని దిగువన ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోని 6 గేట్లను 2.5 మీటర్లు, 5 గేట్లను 3 మీటర్లు పైకి ఎత్తి 2,30,114 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. ప్రస్తుతం 35.19 టీఎంసీల నీరు ఉంది. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 53.34 మీటర్లు కాగా.. ప్రస్తుతం 51.12 మీటర్ల నీటి మట్టం ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 167.71 అడుగుల వరకు నీరు ఉంది.

జెన్‌కోలో 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. శుక్రవారం విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేశారు. దీని విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మొత్తం 120 మెగావాట్లు. కాగా ప్రస్తుతం 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎస్‌ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు నగలు



స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

- 35.4 తులాల బంగారం, 10 తులాల వెండి
- ఆరు మొబైల్స్, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్ : ఒంటరిగా నిద్రిస్తున్న మహిళల ఒంటిపై నుంచి ఆభరణాలు దొంగిలించడం, నిర్మానుష్య ప్రాంతాల్లో ఉన్న స్త్రీ, పురుష జంటలను బెదిరించి డబ్బులు వసూలు చేయడం, తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలో కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను మునగాల, హుజూర్‌నగర్, చివ్వెంల పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ.30 లక్షల విలువగల 35.4 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, ఆరు మొబైల్స్, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. హుజూర్‌నగర్ పీఎస్ పరిధిలో ఒకరిని, మునగాల పీఎస్ పరిధిలో ఇద్దరిని, చివ్వెంల పీఎస్ పరిధిలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని, చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక నిందితుడు పరారీలో ఉన్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్ రెడ్డి, సీసీఎస్ సీఐ ఆనంద్ కిశోర్, ఎస్‌ఐలు శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ముత్తయ్య, సాయి ప్రశాంత్, రత్నం, సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను అరెస్టు చేయడంతో సహకరించిన సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డ్ అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ఏపీ లింగోటం గ్రామ శివారులో ఘటన

నార్కట్‌పల్లి : ప్రమాదవశాత్తు కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామ శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా భీమడోలు గ్రామానికి చెందిన కర్నాటి నాగరాజు(29)తోపాటు అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చిట్యాల మండలంలో గురువారం రాత్రి ట్రాలీ వాహనంలో మొక్కజొన్న కంకుల లోడ్ చేసుకుని ఏలూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో ఏపీ లింగోటం గ్రామశివారుకు రాగానే భోజనం చేసేందుకు ట్రాలీ వాహనాన్ని ఆపారు. అందులో ఉన్న నాగరాజు భోజనం ప్లేట్లు కొనుగోలు చేసేందుకు రోడ్డు దాటాడు. పేపర్ ప్లేట్స్ కొనుగోలు చేసి ఆటో వద్దకు వెళుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ నాగరాజును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న కర్నాటి వెంకటేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.క్రాంతికుమార్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

భువనగిరి క్రైమ్ : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన భువనగిరిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి రైల్వే స్టేషన్ నుంచి వంగపల్లి మధ్యలోగల 240/30–32 మైలు రాయి వద్ద దిగువ లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం రైలు నుంచి కింద పడి మృతిచెందాడు. మృతుడు నల్లటి టీషర్టు, నల్లటి నైట్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. వివరాలకు 9848222169, 8712568454 నంబర్లను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గల ఖాళీ స్థలంలో 50–55 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గల ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి చేతిలో ఒక ప్లాస్టిక్ కవరులో మోనోక్రోటోపాస్ పురుగుల మందు లీటర్ డబ్బా ఉంది. ఓ చెట్టు కింద 15–20 రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్, గణేష్‌నగర్‌కు చెందిన యువకులు భరత్, రఫీ అటు నుంచి వెళ్తుండగా దుర్వాసన రావడంతో గుర్తించి స్థానిక కౌన్సిలర్ కమలి భీమ్లా నాయక్‌కు సమాచారం అందించారు. కౌన్సిలర్ ఈ విషయాన్ని మిర్యాలగూడ రూరల్ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ కె.నరేష్ తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు ఫుల్ చొక్కా, లైట్ గ్రీన్ పూల డిజన్ రంగు లుంగీ ఉంది. నల్లగొండ నుంచి క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించిందని ఎస్‌ఐ వివరించారు. కౌన్సిలర్ కమలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు



పట్టుబడిన నిందితులతో డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండక్రైం: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివరాంరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు.. వన్‌టౌన్ పరిధిలోని షంషునగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సమద్ దేవరకొండ రోడ్డులోని సూర్యా ఆసుపత్రి సమీపంలో ఉండే గొట్టిముక్కల లక్ష్మణ్, రుద్రమదేవి కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ అహ్మద్, ముత్యాలమ్మ కాలనీకి చెందిన కత్తుల అఖిల్ అలియాస్ చంటి, మిర్యాలగూడ రోడ్డులోని ఆనంద్‌నగర్‌కు చెందిన వల్లపు శివలు ముఠాగా ఏర్పడ్డారు. వీరు నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ జెండా దగ్గర గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ ఎస్‌ఐ శంకర్ ఆధ్వర్యంలో ముఠా సభ్యులను పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.90 వేల విలువైన మూడున్నర కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 3న ఆటోలో అధికారుల అనుమతితో ఆవును తరలిస్తున్న వాహనదారుడిని ఇదే నిందితులు గంజాయి మత్తులో బెదిరించి రూ.4 వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నట్లు వివరించారు. గతంలో వీరంతా జైలు జీవితం గడిపినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్, సిబ్బంది షకీ, శ్రీకాంత్‌లను డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

గరిడేపల్లి : బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండల కేంద్రానికి చెందిన మలిగిరెడ్డి కోటిరెడ్డి హుజూర్‌నగర్ వైపు నుంచి స్వగ్రామం నేరేడుచర్ల వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పన్నపేట వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడడంతో కోటిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కోటిరెడ్డిని ప్రైవేట్ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ ఈట సైదులును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

లారీ ఢీకొని..

లారీ, బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఈటె సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన రేఖ వెంకటేశ్వర్లు తన బైక్‌పై రాయినిగూడెం మీదుగా హుజూర్‌నగర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో రాయినిగూడెం గ్రామ శివారులో తనకు ఎదురుగా హుజూర్‌నగర్ వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లు తలకు, ఎడమ కాలుకు బలమైన గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వర్లు అన్న జానకిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి...

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ శివారులో చోటు శుక్రవారం చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేషనల్ హైవే 167పై హుజూర్‌నగర్ నుంచి గుడుగుండ్ల పాలెం వెళ్తున్న కారు టైరు పంక్చర్ అయింది. దీంతో కారు అదుపు తప్పి హుజూర్‌నగర్ వైపు బైక్‌పై వస్తున్న చింతలపాలెం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన షేక్ మౌలానా, దేవ భిక్షంలను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఆటోలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం సూర్యాపేటకు తరలించారు.

నిరుపేద యువకుడికి తీరని కష్టం

- చిన్నపేగు దెబ్బతినడంతో ఆస్పత్రిలో చేర్పించిన తల్లిదండ్రులు
- వైద్యం చేయించే స్థోమత లేక ఇబ్బంది పడుతున్న పేద కుటుంబం
- దాతల సాయం కోసం వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తేజ

కన్నీటి గాథ

మునగాల (కోదాడ): రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చిపడింది. ఆ పేద కుటుంబానికి చెందిన యువకుడు అకస్మాత్తుగా అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దయార్ధ్ర హృదయులు ఆదుకుని తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని ఆ నిరుపేద కుటుంబం వేడుకుంటోంది. వివరాలు.. మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మొలుగూరి శ్రీను –మంగమ్మ దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు. ఇందులో సందీప్ పెద్ద కుమారుడు. చిన్న కుమారుడు తేజ అవివాహితుడు దాదాపు 21 సంవత్సరాల వయస్సు ఉంటుంది. జీవనోపాధి నిమిత్తం ఇద్దరు కుమారులతో సహా శ్రీను కుటుంబం నాలుగేళ్ల క్రితం హైదరాబాద్ చేరుకుని కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతం సాయిబాబానగర్ కాలనీలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు సందీప్ రిలయన్స్ స్టోర్స్‌లో పనిచేస్తుండగా, చిన్న కుమారుడు తేజ క్యాబ్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నారు.

జీర్ణాశయంలో ఇన్‌ఫెక్షన్ ఏర్పడి..

తేజ ఈ నెల రెండో తేదీన విధులు ముగించుకుని ఇంటివద్దకు చేరుకోగానే కడుపులో నొప్పి వస్తుందని కుప్పకూలిపోయాడు. దీంతో తల్లిదండ్రులు తమ కుమారుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల పాటు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం నిమిత్తం కార్పొరేట్ ఆస్పత్రికి తరలించాలని ఆస్పత్రి సిబ్బంది సూచించారు. దీంతో వారు హైదరాబాద్‌లోని మల్లారెడ్డి –నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు తేజ కడుపులోని జీర్ణాశయంలో ఇన్‌ఫెక్షన్ ఏర్పడి చిన్నపేగు పూర్తిగా దెబ్బతిందని చెప్పారు. దీంతో సుమారు రూ.రెండు లక్షలు తెలిసిన వారి దగ్గర అప్పు తెచ్చి వారం రోజులుగా తేజకు వైద్యం చేయిస్తున్నారు. తేజకు ఆపరేషన్ చేస్తే బతికే అవకాశం ఉందని, సుమారు రూ.ఆరు లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ చేయించే స్థోమత లేక, కుమారుడిని బతికించుకునేందుకు ఆ పేద కుటుంబం నానా తంటాలు పడుతోంది. దయగలవారు ఆర్థికసాయం అందజేసి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని ఆ నిరుపేద కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

సాయం చేయదలిచిన వారు ఈ క్రింది చిరునామాను సంప్రదించవచ్చు

మొలుగూరి సందీప్
గ్రామం : బరాఖత్‌గూడెం, మం: మునగాల
ఫోన్ పే : 7702307429
గూగుల్ పే : 6301856207

ఆపరేషన్ చేయించే స్థోమత మాకు లేదు



అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నా తమ్ముడికి ఆపరేషన్ చేయించే స్థోమత మాకు లేదు. ఇప్పటికే రూ.రెండు లక్షలు అప్పుచేసి వైద్యం చేయించాం. రోజుకు రూ.30 నుంచి రూ.40 వేలు ఖర్చు అవుతోంది. ఆపరేషన్ చేయాలంటే వైద్యులు రూ.ఆరు లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. అంత సొమ్ము మావద్ద లేదు. ఎవరైనా తమకు తోచిన విధంగా ఆర్థికసాయం చేసి ఆదుకోవాలి.

– మొలుగూరి సందీప్, తేజ సోదరుడు

మానవత్వం చాటుకున్న ఎస్పీ



రోడ్డు ప్రమాదం వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడిని వాహనంలోకి ఎక్కిస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని తన కాన్వాయ్‌లో ఆస్పత్రికి పంపి నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల మెడికల్ కాలేజీ సమీపంలో శుక్రవారం పులిమామిడి గ్రామానికి చెందిన అమృతయ్య నల్లగొండ నుంచి తన గ్రామానికి టీవీఎస్‌పై వెళ్తుండగా ఎదురుగా పల్సర్ బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో అమృతయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సుంకిశాలకు వెళ్తూ క్షతగాత్రుడిని గమనించి వెంటనే తన కాన్వాయ్ ఆపారు. అమృతయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తన కాన్వాయ్ వాహనంలో తరలించారు. కాన్వాయ్‌లో ఒక వాహనం లేకుండానే ఎస్పీ సుంకిశాలకు వెళ్లారు.

ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గిరిజన యువకుడు



రమావత్ రాందాసు

పెద్దఅడిశర్లపల్లి : ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు ఓ గిరిజన విద్యా కుసుమం. పెద్దఅడిశర్లపల్లి మండలం చింతల్ తండాకు చెందిన రమావత్ రాందాసు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. మొదట 2020, 2021 సంవత్సరాల్లో ఎస్ఎస్‌సీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌గా వరుసగా రెండుమార్లు ఎంపికయ్యాడు. 2022లో పోస్టల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. 2023లో ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అకౌంటెంట్‌గా, అసిస్టెంట్ కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం రాందాసు బెంగుళూరులో ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. పెద్దఅడిశర్లపల్లి మండలం చింతల్ తండాకు చెందిన రమావత్ భిక్ష్యానాయక్–శాంతి దంపతుల కుమారుడు రాందాసు. ఇతడు ఎస్సెస్సీ మిర్యాలగూడలో, ఇంటర్ హైదరాబాద్‌లో, బీటెక్ పశ్చిమబెంగాల్‌లో పూర్తి చేశారు.